# క్రాస్ రోడ్ లో కాపు రామచంద్రారెడ్డి



విజయవాడ : వైసీపీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి విజయవాడలో బీజేపీ అగ్రనేతల్లో ఒకరు అయిన రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో భేటీ అయ్యేందుకు ప్రయత్నించారు. ఆయన విజయవాడ పర్యటనకు రావడంతో.. కాపు రామచంద్రారెడ్డి విజయవాడలో ఆయన బస చేసిన హోటల్ వద్దకు వెళ్లారు. పు రామచంద్రారెడ్డి సీనియర్ నాయకుడు. సీఎం జగన్ కు నమ్మిన బంటు. కానీ జగన్ ఆయనకు టికెట్ నిరాకరించారు. తనకు సీటు ఇవ్వకపోవడంపై సీఎం క్యాంప్ కార్యాలయం దగ్గరే రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నీకు గుడ్ బై అంటూ సీఎం క్యాంప్ కార్యాలయానికి సెల్యూట్ చేశారు. జగన్ నమ్ముకుని వచ్చినందుకు తమ జీవితాలు నాశనం అయ్యాయని వాపోయారు. అయితే ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరతారని ప్రచారం జరిగింది. షర్మిల పిసిసి పగ్గాలు అందుకోవడంతో ఆమె వెంట నడుస్తారని టాక్ నడిచింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రఘువీరారెడ్డి ఆశీర్వాదం తీసుకోవడంతో.. కాంగ్రెస్ లో చేరిక లాంఛనమేనని ప్రచారం జరిగింది.కానీ ఎందుకో ఆ పార్టీలో చేరలేదు.కొద్దిరోజుల కిందట కాపు రామచంద్రారెడ్డి మెత్తబడినట్లు వార్తలు వచ్చాయి. తిరిగి ఆయన వైసీపీలో చేరతారని ప్రచారం జరిగింది. అందుకు తగ్గట్టుగానే ఆయన వ్యాఖ్యానాలు కొనసాగాయి. జగన్ పై తాను విమర్శలు చేయనని కూడా ఆయన చెప్పుకొచ్చారు. వ్యతిరేక ప్రచారం చేయనని కూడా అన్నారు. అయితే ఈరోజు విశాఖ పర్యటనకు వచ్చిన రాజ్ నాథ్ సింగ్ కు కాపు రామచంద్రారెడ్డి కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. పురందేశ్వరి దగ్గరుండి ఆయనను కేంద్రమంత్రి తో కలిపించారు. ఆయన కుటుంబ సమేతంగా వచ్చి కలవడంతో.. తప్పకుండా బిజెపిలో చేరతారని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం తెలుగుదేశం, జనసేనల మధ్య పొత్తు కుదిరింది. బిజెపి సైతం కూటమిలోకి వస్తుందని ప్రచారం జరుగుతోంది. ఈ తరుణంలో వైసిపిలో టిక్కెట్ దక్కని చాలామంది నాయకులు బిజెపికి టచ్లోకి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే బిజెపిలో ఆశావహుల సంఖ్య అధికంగా ఉంది. అందుకే బిజెపి అగ్రనేతలు ఎవరికీ హామీ ఇవ్వడం లేదు. కానీ పొత్తు వ్యవహారం తేలాక చేరికలపై బీజేపీ దృష్టి పెట్టి అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే కాపు రామచంద్రారెడ్డి చేరిక విషయంపై ఒకటి, రెండు రోజుల్లో క్లారిటీ రానున్నట్లు సమాచారం. అయితే ఆయనను అనుమతించలేదని తెలుస్తోంది. ఏపీ బీజేపీ నేతలతో మాట్లాడి వచ్చారు. రాజనాథ్ సింగ్ ను కలిసేందుకే వచ్చాననని.. మా జిల్లాకు సంబంధం లేని మీటింగ్ ఇక్కడ జరుగుతుంది.. అందుకే మీటింగ్ లో నుంచి బయటికి వచ్చేశానని మీడియాతో చెప్పారు. ప్రస్తుతానికి ఏ పార్టీలో చేరాలో పూర్తిగా ఏ నిర్ణయం తీసుకోలేదని.. స్పష్టం చేశారు. కానీ వైసిపి ని పూర్తిగా వదిలేశాను... ఆ పార్టీ తో నాకు సంబంధం లేదన్నారు. వచ్చే ఎన్నికలలో తాను పోటీ చేస్తున్నానని.. ఏ పార్టీ అనేది త్వరలో చెబుతానన్నారు. మంగళగిరిలో జరుగుతున్న వైసిపి మీటింగ్ నుంచి నాకు ఎటువంటి సమాచారం లేదని.. రాజ్ నాథ్ సింగ్ ను మర్యాద పూర్వకంగా కలిసేందుకు వచ్చానన్నారు. త్వరలోనే అన్నివిషయాలు వివరిస్తానని.. ఆ తరువాత రాష్ట్రం లో పరిస్థితులు పై మాట్లాడతానని చెప్పుకొచ్చారు. కాపు రామచంద్రారెడ్డి గతంలో కాంగ్రెస్ లోచేరాలని అనుకున్నారు. మడకశిర వెళ్లి రఘువీరారెడ్డితో సమావేశం అయ్యారు. రానున్న ఎన్నికల్లో కాపు రామచంద్రారెడ్డి, తన భార్య కాపు భారతి రెడ్డి రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పోటీలో ఉంటామని చెబుతున్నారు. కాంగ్రెస్ లో చేరాలని అనుకున్నా.. మళ్లీ బీజేపీ వైపు చూస్తున్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన కాపు రామచంద్ర రెడ్డికి వైఎస్ జగన్ కూడా పలుమార్లు టిక్కెట్ ఇచ్చారు. వైఎస్ఆర్సిపీ ఆవిర్భావం నుంచి జగన్మోహన్ రెడ్డి వెంట వచ్చిన నేతగా గుర్తింపు ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో కాపు రామచంద్ర రెడ్డి కి టికెట్ ఇవ్వటం కుదరదు అని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తెలపడంతో కాపు రామచంద్ర రెడ్డి తీవ్ర మనోవేదనకు గురయ్యారు. తాడేపల్లి సీఎంవో కార్యాలయం నుంచి బయటకు వచ్చి సీఎం క్యాంప్ ఆఫీసుకు సెల్యూట్ చేశారు. జగన్మోహన్ రెడ్డి నమ్మించి గొంతు కోశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏ పార్టీలో టిక్కెట్ ఇచ్చినా చేరేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారు. కానీఏ పార్టీ నుంచి ఆయనకు ఆహ్వానం అందడం లేదు. కాంగ్రెస్ పార్టీ కూడా ఆయనపై పెద్దగా ఆసక్తి చూపించ లేదు. బీజేపీ పొత్తులు పెట్టుకుంటే.. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఆ పార్టీ నుంచి టీడీపీ మద్దతుతో బీజేపీ తరపున పోటీ చేయవచ్చున్న ఆలోచనతో ఆయన బీజేపీలో చేరేందుకు ప్రయత్నించినట్లుగా తెలుస్తోంది. అయితే ఏపీ బీజేపీ నేతలు ఆయనను పట్టించుకోలేదు.

# మైలవరం వసంతదే... పెనమలూరుకు దేవినేని

విజయవాడ : కృష్ణా జిల్లా రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ప్రధాన పార్టీలైన వైసీపీ, తెలుగుదేశం పార్టీలు అభ్యర్థులు ఎంపిక విషయంలో జాగ్రత్త వహిస్తున్నాయి. ఇటు నుంచి అటు, అటు నుంచి అభ్యర్థుల జంపింగ్ చేస్తున్నారు. తాజాగా మైలవరం నియోజకవర్గంలోనూ రాజకీయాలు ఆసక్తిగా మారాయి. ఇక్కడి సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న వసంత కృష్ణ ప్రసాద్ వైసీపీకి దూరంగా ఉంటూ వస్తున్నారు. రెండు రోజుల్లో టీడీపీలో చేరేందుకు సిద్ధపడుతున్నారు.గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పని చేసిన దేవినేని ఉమామహేశ్వరరావు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బరిలో దిగేందుకు సిద్ధంగా ఉన్నారు. గత కొన్నాళ్లుగా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గానూ ఆయన ఉన్నారు. కానీ, ఈ సీటును సిటింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కు ఇచ్చేందుకు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సిద్ధపడినట్టు తెలుస్తోంది. రెండో విడత జాబితాలో ఆయన పేరును ప్రకటించే చాన్స్ ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నారు. పార్టీలో చేరిన తరువాత ఈ మేరకు ప్రకటన ఉండే అవకాశముంది.మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, సిటింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మధ్య తీవ్రస్థాయిలో విభేధాలు ఉన్నాయి. ఇరువురు నేతలు మొన్నటి వరకు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించుకున్నారు. మైలవరంలో దేవినేని ఓటమే లక్ష్యంగా రాజకీయాలు నెరిపిన కృష్ణప్రసాద్ గడిచిన ఎన్నికల్లో అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. రానున్న ఎన్నికల్లోనూ మైలవరం నుంచి పోటీ చేస్తానంటూ చెబుతూ వచ్చిన కృష్ణప్రసాద్ అనుకున్నట్టుగానే అక్కడ పోటీకి సిద్ధపడుతున్నారు. కాకపోతే ఈసారి తెలుగుదేశం పార్టీ నుంచి ఆయన పోటీ దాదాపు కన్ఫార్మ్ అయింది. ఈ నేపథ్యంలో వసంత కృష్ణప్రసాద్‌కు మైలవరం సీటు కేటాయిస్తే.. మాజీ మంత్రి దేవినేనికి ఎక్కడ సీటు ఇస్తారన్న దానిపైనా ఆసక్తి నెలకొంది. ఇందుకు టీడీపీ అధిష్టానం ప్రత్యామ్నాయ మార్గాన్ని చూస్తున్నట్టు చెబుతున్నారు. దేవినేని ఉమా మహేశ్వరరావుకు పెనమలూరు సీటు ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఉమాకు చంద్రబాబు హామీ ఇచ్చినట్టు చెబుతున్నారు. కానీ, ఉమామహేశ్వరరావు మైలవరం నుంచి బయటకు వెళ్లేందుకు సిద్ధపడతారా.? లేదా..? అన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ రెండు రోజుల్లో టీడీపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సీటు కేటాయింపుపై హామీ లభించిన తరువాతే టీడీపీలో చేరాలని ఆయన నిర్ణయించుకున్నట్టు చెబుతున్నారు. అందుకు అనుగుణంగా టీడీపీ అధిష్టానం నుంచి హామీ లభించడంతో పార్టీలో చేరడానికి ఆయన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ మేరకు టీడీపీ నాయకులతోనూ ఆయన సమావేశమయ్యారు. పార్టీలో చేరుతున్నానని, అంతా సహకరించాలని ఆయన కోరినట్టు చెబుతున్నారు. దేవినేతి ఉమాతో తనకు వ్యక్తిగత వేభేదాలు లేవన్న వసంత.. ఇద్దరం ఇప్పటి వరకు వేర్వేరు దారుల్లో ఉన్నామని, ఇప్పుడు ఒకే దారిలో నడవాల్సి ఉన్నందున టీడీపీ పెద్దల సమక్షంలో ఆయన్ను కలుస్తానని వసంత నేతల సమక్షంలో వెల్లడించారు.

# అమరావతి రైతులకు భారీ ఊరట

గుంటూరు : ఏపీ హైకోర్టులో అమరావతి రైతులకు ఊరట లభించింది. రైతులకు ఇచ్చిన ప్లాట్లను రద్దు చేస్తూ జారీ చేసిన నోటీసులను హైకోర్టు కొట్టివేసింది. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకు గతంలో సీఆర్డీయే ప్లాట్లు ఇచ్చింది. ప్లాట్లను రద్దు చేస్తూ 862 మంది రైతులకు సీఆర్డీఏ, రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. దీంతో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ప్లాట్ల రద్దు, సీఆర్‌డీఏ చట్టం, మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధమని నోటీసులను సవాల్ చేస్తూ పలువురు రైతులు హైకోర్టుకు వెళ్లారు. అయితే సీఆర్డీఏ చట్టంలో మార్పులు చేశామని ప్రభుత్వ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు, ఇంద్రనీల్ వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం.. కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్ ఇచ్చిన నోటీసులు చెల్లవని స్పష్టం చేసింది. ఈ క్రమంలో నోటీసులు, ప్రొసీడింగ్స్ రద్దు చేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.గతంలో భూసమీకరణ కింద రాజధాని కోసం భూములు ఇచ్చిన అమరావతి రైతులకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్లాట్లు కేటాయించింది. వీటిని రద్దు చేస్తూ మొత్తం 862 మందికి సీఆర్డీయే కమిషనర్ నోటీసులు జారీ చేశారు. దీన్ని సవాల్ చేస్తూ సదరు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. సీఆర్డీయే చట్టం కింద భూసమీకరణలో ఇచ్చిన ఫ్లాట్లను రద్దు చేయడంపై వాదనలు జరిగాయి. ఈ ప్లాట్ల రద్దు సీఆర్డీయే చట్టానికి విరుద్దమని న్యాయవాది ఇంద్రనీల్ బాబు వాదనలు వినిపించారు. అసలు సీఆర్డీయే మాస్టర్ ప్లాన్ కు విరుద్దంగా కమిషనర్ ఈ నోటీసులు జారీ చేశారని వాదించారు. ప్రభుత్వం మాత్రం సీఆర్డీయే చట్టంలో మార్పులు చేశామని, కాబట్టి ఈ నోటీసులు చెల్లుతాయని వాదించింది. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు .. సీఆర్డీయే కమిషనర్ రైతులకు ఫ్లాట్లు రద్దు చేస్తూ ఇచ్చిన నోటీసుల్ని రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. దీంతో రైతులకు భారీ ఊరట దక్కినట్లయింది. ఇప్పటికే రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ఫ్లాట్ల కేటాయింపు సక్రమంగా లేకపోవడంతో పాటు వారికి కౌలు కూడా దక్కడం లేదు. రాజధానిగా అమరావతిని ప్రకటించినప్పుడు ఎందరో రైతులు స్వచ్ఛందంగా భూములిచ్చారు. కొందరు ఇవ్వడానికి విముఖత చూపారు. ప్రభుత్వం ల్యాండ్‌పూలింగ్ విధానాన్ని ప్రకటించింది. ప్రతిఫలంగా సదరు రైతులకు నిర్ణయించిన ధర ఇచ్చేందుకు చర్యలు తీసుకుంది. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే ల్యాండ్‌పూలింగ్ భూముల్లో అమరావతికి భూములిచ్చిన రైతులకు స్థలాల కేటాయింపు జరిగింది. ఇంతలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. రిజిస్ట్రేషన్ కాని ఆ స్థలాలను ఉపయోగించుకోవడానికి, అవసరాలకు అమ్ముకోవడానికి లేకుండా పోతోందంటూ, వాటిని మార్చి ఇవ్వాలని వైసీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి రైతులు సీఆర్డీఏ అధికారులను వేడుకొంటున్నారు. ఈ నాలుగున్నరేళ్లలో స్పందించని రాష్ట్రప్రభుత్వం, సీఆర్డీఏ ఉన్నట్టుండి ఇప్పుడు సదరు ప్లాట్లు రద్దుచేసుకోవాలని, వేరేచోట ప్లాట్లు కేటాయిస్తామని నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసులు చట్ట విరుద్ధం కావడంతో కోర్టు కొట్టి వేసింది

# పవన్ త్యాగశీలి..

రాజమండ్రి : టిడిపి,జనసేన తొలి జాబితాను ప్రకటించాయి. పొత్తులో భాగంగా జనసేనకు 24 అసెంబ్లీ స్థానాలతో పాటు మూడు పార్లమెంట్ స్థానాలు ఇచ్చేందుకు టిడిపి అంగీకరించింది. టిడిపి 94 మంది అభ్యర్థులను ప్రకటించగా.. జనసేన ఐదుగురు అభ్యర్థులను ఖరారు చేస్తూ పేర్లు ప్రకటించింది. అయితే రెండు పార్టీల్లోనూ అసంతృప్తులు బయటపడ్డాయి. కానీ వాటిని అధిగమించే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే రెండు పార్టీలకు చెందిన కీలక నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న చోట మాత్రం ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. సీటు తమకంటే తమకే నంటూ వారు పోటాపోటీగా ప్రకటనలు చేస్తున్నారు. దీంతో ఒక రకమైన గందరగోళం నెలకొంటుంది.జనసేన కీలక నేత కందుల దుర్గేష్ పోటీ చేయాలని చూస్తున్నారు. పవన్ సైతం రాజమండ్రి రూరల్ జనసేనదేనని తేల్చి చెప్పారు. అయితే అక్కడ టిడిపి సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఉన్నారు. ఆయన పొలిట్ బ్యూరో సభ్యుడే కాదు.. టిడిపి వ్యవస్థాపక సభ్యుడు కూడా. తన సీటును వేరెవరికి ఎలా ఇస్తారని ఆయన గట్టిగానే ప్రశ్నించారు. ఆ సీటు విషయంలో చంద్రబాబు విజ్ఞప్తి మేరకు పవన్ పునరాలోచించారు. ఆ సీటు బదులు జనసేనకు నిడదవోలు ఇస్తుందని.. అక్కడ నుంచి పోటీ చేయాలని దుర్గేష్ కు పవన్ సూచించినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ లెక్కన దాదాపు రాజమండ్రి రూరల్ లో బుచ్చయ్య చౌదరి పోటీ చేసేందుకు దాదాపు మార్గం సుగమం అయ్యింది.అయితే ఈ నియోజకవర్గ ఒక కొలిక్కి వచ్చిందనగా.. తెరపైకి భీమిలి నియోజకవర్గం వచ్చి పడింది. పొత్తులో భాగంగా భీమిలిని జనసేనకు కేటాయిస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ సీటు పై గంటా శ్రీనివాసరావు ఆశలు పెట్టుకున్నారు.ఇదే విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. అయితే చంద్రబాబు మాత్రం చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని గంటాకు సూచించారు. కానీ గంటా శ్రీనివాసరావు అందుకు సుముఖంగా లేరు. తనకు భీమిలి సీటు కేటాయించాలని కోరుతున్నారు. అందుకోసమే భీమిలి నియోజకవర్గం నుంచి జనసేనను తప్పించి.. వేరే నియోజకవర్గాన్ని కేటాయిస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటికే రాజమండ్రి రూరల్ విషయంలో జనసేన త్యాగం చేసిందని.. బలం ఉన్న భీమిలిని వదులుకోవడం కష్టమేనని జనసేనలో టాక్ నడుస్తోంది. అయితే పవన్ కు గంటా సన్నిహిత నేత. ఆపై న్యాయం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. దీంతో పవన్ జనసేన సీటును తప్పకుండా వదులుకుంటారని పొలిటికల్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అదే నిజమైతే విశాఖలో భీమిలి స్థానంలో జనసేనకు కేటాయించే నియోజకవర్గం ఏమిటి అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీనిపై ఒకటి రెండు రోజుల్లో క్లారిటీ రానుంది.

**మాట్లాడే హక్కు ఎక్కడ...** కేవలం 24 సీట్లకే తలొగ్గడం ఏమిటని పవన్ గురించి మాట్లాడుతున్నారని... 2019లో ఆయనను గెలిపించుకోలేని మనకు ఆయన గురించి మాట్లాడే హక్కు ఉందా? అని హైపర్ ఆది ప్రశ్నించాడు. సొంత కష్టార్జితంతో పార్టీని నడుపుతున్న గొప్ప నాయకుడు పవన్ అని కొనియాడాడు. రోజుకు రెండు కోట్ల రెమ్యునరేషన్ తీసకునే పవన్... సంపాదన మొత్తాన్ని సహాయ కార్యక్రమాలకు పెట్టేసి... ఇప్పుడు దాదాపుగా అప్పు చేసి పార్టీని నడుపుతున్నారని చెప్పాడు.

చిన్న పరీక్షలో ఫెయిల్ అయతేనే మనం పది రోజులు బయటకు రాలేమని... అలాంటిది రెండు చోట్ల ఓడిపోయినా రెండో రోజే కౌలు రైతుల కష్టాలు తీర్చిన గొప్ప మనసు పవన్ దని కొనియాడాడు. కులాన్ని, పార్టీని తాకట్టు పెట్టారని, ప్యాకేజీ తీసుకున్నాడని చాలా ఈజీగా కామెంట్ చేస్తున్నారని... ఇలాంటి మాటలు ఎందుకని హైపర్ ఆది అన్నాడు. ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కంటే అధికారంలో ఉన్న వైసీపీ వద్ద ఎక్కువ డబ్బు ఉందని... అలాంటప్పుడు వైసీపీ దగ్గరకు పవన్ ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించాడు. అభిమానించడం అంటే మనకు అనుకూలంగా ఉన్నప్పుడు జై కొట్టడం... అనుకూలంగా లేనప్పుడు బై చెప్పడం కాదని అన్నాడు. నాయకుడు ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉండటాన్నే అభిమానం అంటారని చెప్పారు. మన నాయకుడిని తక్కువ చేసి మాట్లాడకూడదని హితవు పలికాడు.

# షర్మిల... ఎక్కడ నుంచి పోటీ...

కడప : సార్వత్రిక ఎన్నికల గడువు సమీపిస్తున్న ఏపీలో రాజకీయ పార్టీలన్ని దూకుడు పెంచాయి. అన్ని పార్టీలు ప్రచార కార్యక్రమాలతో పాటు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్ని ప్రకటిస్తున్నాయి. ఈ క్రమంలోనే లో కాంగ్రెస్ పార్టీలో కూడా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. పిసిసి అధ్యక్షురాలిగా వైఎస్.షర్మిల బాధ్యతలు చేపట్టిన తర్వా త పార్టీ కార్యక్రమాల్లో దూకుడు పెరిగింది.దాదాపు పదేళ్లుగా ఏపీలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా నిస్తేజమై పోయింది. పార్టీ క్యాడర్ మొత్తం చెల్లాచెదురైపోయింది. ఒకప్పటి కాంగ్రెస్ శ్రేణులన్నీ వైసీపీ వెంట వెళ్లిపోయాయి. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని వెన్నంటి ఉన్న వర్గాల్లో చాలా వరకు జగన్ వెంట నడిచాయి. కాంగ్రెస్ పార్టీకి బలమైన ఓటు బ్యాంకులుగా ఉన్న మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలను జగన్ తన వైపు తిప్పుకోవడంలో విజయం సాధించారు.ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అనూహ్యంగా ఏపీ కాంగ్రెస్‌లోకి వైఎస్ షర్మిల వచ్చారు. జనవరిలో ఆమె పిసిసి పగ్గాలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించారు. జిల్లా పర్యటనలతో పార్టీలో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నారు.పదునైన విమర్శలతో ప్రభుత్వంపై విరుచుకు పడుతున్న షర్మిల రాజకీయంగా కూడా వేడి పుట్టిస్తున్నారు. షర్మిల రాకతో ఏపీ రాజకీయాల్లో కొత్త పరిణామాలు ఉంటాయని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ క్రమంలో సార్వత్రిక ఎన్నికల్లో షర్మిల పోటీ చేస్తుందా లేదా అనే చర్చ విస్తృతంగా జరుగుతోంది.షర్మిల వైఎస్సార్ తెలంగాణ పార్టీతో తెలంగాణలో రెండేళ్ళ క్రితమే క్రియాశీల రాజకీయాల్లో అడుగు పెట్టినా ఇప్పటి వరకు ఒక్క ఎన్నికలో కూడా పాల్గొనలేదు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలను దెబ్బ తీయకూడదనే ఉద్దేశంతో పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఆ తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించింది.తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఆమె ఏపీకి తిరిగి వచ్చేశారు. ఏపీ కాంగ్రెస్‌లో తన రాజకీయ అస్తిత్వాన్ని వెదుక్కుంటున్నారు. షర్మిల ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా విషయంలో ఆ పార్టీ ముఖ్య నాయకుల్లో కూడా క్లారిటీ లేదు. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షాలైన వైసీపీ, టీడీపీ వైఫల్యాలను ఎండగడుతున్న షర్మిల వచ్చే ఎన్నికల్లో ఎక్కడ నుంచి పోటీ చేస్తారనేది అందరిలో ఆసక్తి కలిగిస్తోంది.కాంగ్రెస్ పార్టీలో చేరే సమయంలో షర్మిలకు రాజ్యసభ సభ్యత్వం దక్కుతుందని ప్రచారం జరిగింది. ఇటీవల రాజ్యసభ ఎన్నికల్లో ఆమెకు అవకాశం దక్కలేదు. దీంతో ఏపీలో జరిగే ఎన్నికల్లో షర్మిల పాల్గొంటారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.ఏపీ కాంగ్రెస్‌లో ప్రస్తుతం వన్ వే కమ్యూనికేషన్ మాత్రమే నడుస్తోందని ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలకు భిన్నంగా షర్మిల వ్యవహార శైలి ఉందనే ప్రచారం కూడా ఉంది. రఘువీరా రెడ్డి, కేవీపీ వంటి ఒకరిద్దరికి మాత్రమే షర్మిల అందుబాటులో ఉంటారని పార్టీలో ఇతర నాయకులు ఎవరికి ఆమెతో చర్చించే అవకాశం కూడా ఉండదని ప్రచారం జరుగుతోంది.పార్టీ కార్యక్రమాల నిర్వహణపై షర్మిల సిబ్బంది నుంచి అందే సమాచారం ఆధారంగా మిగిలిన వారు సమన్వయం చేసుకుంటున్నారని చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో షర్మిల పోటీ చేస్తే మిగిలిన వారికి కూడా ఉత్సాహాన్నిస్తుందని చెబుతున్నారు. మరోవైపు షర్మిల ప్రచారానికే పరిమితం కావొచ్చనే వాదన కూ? ఉంది.కొద్ది రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న షర్మిల కుమారుడి వివాహం పూర్తైన వెంటనే నేరుగా విజయవాడ వచ్చారు. గురువారం చలో సెక్రటేరియట్ ముట్టడికి పిలుపునివ్వడంతో విమానాశ్రయం నుంచి నేరుగా ఆంధ్రరత్న భవన్‌కు వచ్చారు.కుమారుడి వివాహం అనంతరం గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన వైఎస్ షర్మిల మొదట కేవీపీ ఇంటికి వెళ్తారని ప్రచారం జరిగింది. ఆ తర్వాత సడెన్‌గా రూట్ మార్చేశారు. తొలుత అంపాపురంలోని మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు నివాసానికి వెళ్లాలని భావించారు.పోలీసులు అనుసరిస్తున్నారని తెలియడంతో కాంగ్రెస్ నేతలు వెంటనే రూట్ మార్చి విజయవాడలోని ఆంధ్ర రత్న భవన్‌కు తీసుకున్నారు. షర్మిల, కాంగ్రెస్ నేతలంతా ఆంధ్ర రత్న భవన్‌కు వెళ్లారు. అక్కడి నుంచే ఛలో సెక్రటేరియట్‌కు వెళ్లాలని నిర్ణయించారు.ఆంధ్రరత్న భవన్‌కు చేరుకున్న ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలరాత్రి పార్టీ కార్యాలయం లోనే బస చేశారు. ఆందోళనల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు హౌజ్ అరెస్ట్ చేస్తున్నారు. తొలుత షర్మిల కేవీపీ నివాసానికి వెళితే అక్కడ ఆమెను హౌజ్ అరెస్ట్ చేయాలని భావించారు. అలర్ట్ అయిన షర్మిల, కాంగ్రెస్ నేతలు.. ఆంధ్రరత్న భవన్‌కు చేరుకున్నారు. ముందస్తు అరెస్ట్‌ల నేపథ్యంలో రాత్రికి ఆంధ్రరత్న భవన్‌లోనే బస చేశారు.

# కన్ఫ్యూజన్ లో జనసేనాని.. ఇప్పుడేం చేద్దాం..

విజయవాడ : టీడీపీ–జనసేన కూటమి తొలిజాబితా ప్రకటన తర్వాత రెండు పార్టీల్లో కొత్త టెన్షన్ మొదలైంది. జనసేన పార్టీకి 24 అసెంబ్లీ, మూడు పార్లమెంట్ స్థానాలను కేటాయిస్తున్నట్లు టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఈ నెంబర్‌పై సంతృప్తి వ్యక్తం చేసిన జనసేనాని పవన్ స్పందిస్తూ ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తామని కాదు.. ఎన్నిచోట్ల గెలుస్తామన్నదే ముఖ్యమని క్యాడర్‌కు హితబోధ చెప్పారు. జనసేనలో చాలా మంది నేతలు 24 సీట్లతో సరిపెట్టుకోడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. పొత్తు ధర్మం పాటించలేదని కొందరు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. కానీ, అధినేత పవన్ సంతృప్తి చెందినప్పుడు నేతల వాదన అప్రధానంగా మారింది. ఐతే 24 సీట్లలో పోటీ చేస్తామని ప్రకటించినా, ఏయే నియోజకవర్గాల్లో పోటీ చేస్తారో చెప్పకపోవడంతో జనసేన పార్టీలో కొత్త కన్ఫ్యూజన్ ప్రారంభమైంది.అభ్యర్థుల తొలివిడత జాబితా విడుదల తర్వాత.. 24 సీట్లలో పోటీ చేస్తామని, ముందుగా 5 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు పవన్‌కల్యాణ్. రెండు రోజుల్లో మిగతా లిస్టు కూడా ఇచ్చేస్తామని చెప్పారు. ఐతే తొలిజాబితా విడుదలై రెండురోజులైనా ఇప్పటివరకు 18 నియోజకవర్గాలపై స్పష్టత లేకపోవడంపై విస్తృత చర్చ జరుగుతోంది. తొలివిడత ప్రకటించిన ఐదుతోపాటు రాజోలులో కూడా జనసేన పోటీ చేస్తుందని పవన్ గతంలో చెప్పారు. మరీ ముఖ్యంగా జనసేనాని పవన్ ఎక్కడి నుంచి పోటీ చేసేది వెల్లడించకపోవడం కూడా చర్చకు దారితీస్తోంది.జనసేనాని పవన్ గతంలో భీమవరం, గాజువాక నుంచి పోటీ చేశారు. తొలిజాబితాలో ఈ రెండు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. అదేవిధంగా పవన్ పోటీ చేస్తారని ప్రచారంలో ఉన్న కాకినాడ సిటీ, పిఠాపురం నియోజకవర్గాలకు అభ్యర్థులను ఎంపిక చేయలేదు. దీంతో ఈ నాలుగు నియోజకవర్గాల్లో పవన్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది ఉత్కంఠగా మారింది.పవన్ పోటీ చేస్తే పిఠాపురం వదులుకుంటానని, లేదంటే తన నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించొద్దని డిమాండ్ చేస్తున్నారు టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వర్మ. ఇక కాకినాడ రూరల్ నియోజకవర్గాన్ని తీసుకున్న జనసేన.. సిటీని ఆక్రమిస్తే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు అక్కడి తెలుగు తమ్ముళ్లు.ఎక్కడి నుంచి పోటీ చేయాలనేదానిపై పవన్ తేల్చుకోలేకపోతున్నారా? లేక వ్యూహాత్మకంగానే తాను పోటీ చేస్తానన్న సీటును సీక్రెట్‌గా ఉంచుతున్నారోగాని? టీడీపీ కేటాయించిన నియోజకవర్గాల పేర్లను బహిర్గతం చేసినా కొంత స్పష్టత వచ్చే అవకాశాం ఉండేది.. అభ్యర్థుల ప్రకటన తర్వాత చేసినా, ముందుగా నియోజకవర్గాల పేర్లు తెలియజేస్తే సరిపోయేదానికి? అయోమయం సృష్టించడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు జనసేన నేతలు.సీనియర్ నేతలకు కూడా తమ సీట్లపై క్లారిటీ లేకపోవడంతో గందరగోళంలో పడిపోతున్నారు. రాజమండ్రి రూరల్ సీటు ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే కందుల దుర్గేశ్‌ను కొత్తగా నిడదవోలుకు పంపుతున్నారని ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి చాలాకాలంగా రాజమండ్రి రూరల్‌పైనే ఆశ పెట్టుకున్నారు దుర్గేశ్. ఇప్పుడు కొత్తగా నిడదవోలు తెరపైకి తేవడంతో పోటీపై తర్జనభర్జన పడుతున్నారు దుర్గేశ్.ఇదేవిధంగా చాలా నియోజకవర్గాల్లో కన్ఫ్యూజన్ కనిపిస్తోంది. జనసేన ప్రభావం ఎక్కువగా ఉండే విశాఖ, ఉభయ గోదావరి జిల్లాల్లో కేవలం మూడు సీట్లనే ప్రకటించారు పవన్. మొత్తం 24 సీట్లలో ఏ జిల్లా నుంచి ఏ నియోజకవర్గం కేటాయించారన్న విషయమై క్లారిటీ ఇవ్వాలని కోరుతున్నారు మెజార్టీ జనసేన నేతలు.అభ్యర్థుల ప్రకటన ఆలస్యమైనా.. నియోజకవర్గాలపై స్పష్టత వస్తే.. ఎన్నికల సన్నాహాలు చేసుకోవడం తేలికవుతుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కూటమిలో సీట్ల కూర్పు, సర్దుబాటును అత్యంత రహస్యంగా ఉంచడం వల్ల కలిగే ప్రయోజనం కన్నా, నష్టమే ఎక్కువనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు పరిశీలకులు.జనసేనకు కేటాయించిన సీట్లపై స్పష్టత రానంతవరకు సమన్వయం కూడా కుదిరే పనికాదంటున్నారు. పేరుకు రెండుపార్టీలు సమన్వయంతో పనిచేయాలని చెబుతున్నా, టీడీపీ ఆధిపత్యం ఎక్కువగా ఉందని మదనపడుతున్న జనసైనికులే ఎక్కువగా ఉన్నారు. మొత్తానికి పవన్ పోటీ చేసే నియోజకవర్గంతో సహా మిగతా సీట్లను రహస్యంగా ఉంచడంపై క్యాడర్‌లో అసంతృప్తి ఎక్కువగా కనిపిస్తోంది.

# హైదరాబాద్ పరాజయం

## -కోల్‌కత థండర్‌బోల్ట్స్ మెరుపు విజయం - ప్రైమ్ వాలీబాల్ లీగ్ 2024



**చెన్నై,ఫిబ్రవరి 29 (ప్రజాకలం ప్రతినిధి):** ప్రైమ్ వాలీబాల్ లీగ్ 2024 సీజన్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ పరాజయాల పరంపర కొనసాగుతుంది. గ్రూప్ దశలో బ్లాక్‌హాక్స్ ఆడిన ఐదు మ్యాచుల్లో నాలుగో పరాజయం చవిచూసింది. గురువారం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కత థండర్‌బోల్ట్స్ చేతిలో 8-15, 8-15, 15-11, 18-20తో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ ఓటమి చెందింది. హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ కీలక ఆటగాళు హేమంత్, జొసెఫ్, లాల్ సుజన్ అంచనాలను అందుకోలేదు. కోల్‌కత థండర్‌బోల్ట్స్ ఆటగాళ్లు వినిత్, అమిత్, కుకూర్‌లు ఆకట్టుకునే ప్రదర్శన చేశారు. హైదరాబాద్ బ్లాక్‌హాక్స్‌కు ఇది వరుసగా మూడో ఓటమి కావటం గమనార్హం. కోల్‌కత థండర్‌బోల్ట్స్ మిడిల్ బ్లాక్ అశ్వల్ రాయ్ 'గేమ్ ఛేంజర్' అవార్డు అందుకోగా..వినీత్ కుమార్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు సాధించాడు.

హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ తొలి రెండు సెట్లలో ఆరంభంలో వరుస పాయింట్లతో చూపించిన జోరు.. ఆ తర్వాత కొనసాగించటంలో విఫలమైంది. కోల్‌కత థండర్‌బోల్ట్స్ మ్యాచ్‌లో బ్లాక్‌హాక్స్ తొలి సెట్లో లిబరో బలహీనత దెబ్బతీయగా.. రెండో సెట్లో ఎటాకర్లు దెబ్బకొట్టారు!. తొలి సెట్‌లో తొలుత 4-2తో ముందంజ వేసిన బ్లాకహాక్స్ వరుస పాయింట్లు కోల్పోయి 4-8తో నాలుగు పాయింట్ల వెనుకంజలోకి వెళ్లింది. విరామం అనంతరం సైతం బ్లాక్‌హాక్స్ కోలుకోలేదు. 15-8తో తొలి సెట్ కోల్‌కత కైవసం చేసుకుంది.

రెండో సెట్‌ను సైతం హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ దూకుడుగా మొదలుపెట్టింది. థండర్‌బోల్ట్స్‌పై ఆధిక్యం సాధించింది. కానీ మిడిల్ బ్లాక్ సహా ఎటాకింగ్‌లో వైఫల్యం ప్రతికూల ప్రభావం చూపించింది. రాయ్ అశ్వల్, వినీత్, అమిత్ క్రమం తప్పకుండా పాయింట్లు సాధించటంతో కోల్‌కత థండర్‌బోల్ట్స్ రెండో సెట్‌ను సైతం 15-8తో సొంతం చేసుకుంది. 2-0 ఆధిక్యంతో విజయానికి చేరువైంది.

చావోరేవో తేల్చుకోవాల్సిన మూడో సెట్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ గట్టిగా పుంజుకుంది!. 8-6తో ఆధిక్యంలో నిలిచిన బ్లాక్‌హాక్స్ రెట్టించిన ఉత్సాహంతో కనిపించింది. కోల్‌కత సూపర్ పాయింట్‌ను గెల్చుకున్న బ్లాక్‌హాక్స్ 11-6తో ఆధిక్యం మెరుగుపర్చుకుంది. సమిష్టి ప్రదర్శనతో 15-11తో మూడో సెట్‌ను నెగ్గిన బ్లాక్‌హాక్స్ మ్యాచ్ రేసులోకి వచ్చింది. కీలక నాల్గో సెట్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. విరామ సమయానికి కోల్‌కత థండర్‌బోల్ట్స్ 8-7తో ముందంజ వేసినా హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ గొప్పగా పుంజుకుంది. సూపర్ పాయింట్ నెగ్గి కోల్‌కత థండర్‌బోల్ట్స్ స్కోరును 13-13తో సమం చేసిన బ్లాక్‌హాక్స్ ఆ తర్వాత నువ్వా నేనా అన్నట్టు సాగిన గేమ్‌లో గట్టి పోటీ ఇచ్చింది. 18-18 వరకు సాగిన నాల్గో సెట్ ఉత్కంఠను కోల్‌కత వరుస పాయింట్లతో తెరదించింది. 20-18తో నాల్గో సెట్‌ను, మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.



## గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా నేషనల్ సైన్స్ డే

శామీర్ పేట, ఫిబ్రవరి 29 (ప్రజా కలం ప్రతినిధి ) : విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగడానికి సైన్స్ ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని తెలంగాణ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ అన్నారు. గురువారం శామీర్ పేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో సైన్స్ అధ్యాపకురాలు ఉషారాణి పి పి టి ప్రజెంటేషన్, అధ్యాపకురాలు శ్రావణి టీం డ్రామా, మోడల్స్, స్పేస్ మెన్స్, ప్రాజెక్ట్, పోస్టల్ ప్రజెంటేషన్, రక్త శాతం తదితర ప్రజెంటేషన్ లను ప్రదర్శించారు. ఆయా ప్రజెంటేషన్ల సైన్స్ విజ్ఞానంపై అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చేతన, అధ్యాపకులు సౌమ్య, స్వాతి, శ్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రంథాలయం వసతులు కల్పించాలని ఎంపీపీ సుదర్శన్ రెడ్డి కి వినతిపత్రం

ఘట్కేసర్, ఫిబ్రవరి 29 (ప్రజా కలం ప్రతినిధి ): మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేవైఎం కార్యదర్శి



కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షులు ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ఏదులాబాద్ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులకు సరైన వసతులు కల్పించాలని, విద్యార్థులకు గ్రామ ప్రజలకు విజ్ఞాన్ని కలిగించే గ్రంథాలయం ఎంతో సహాయపడుతుందని వారు అన్నారు. దీనికి స్పందించిన ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు నితీష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# క్లైమేట్ ఇంపాక్ట్ ను అందించనున్న ఎంఐఎఫ్ ప్లాస్టిక్ వ్యర్థాల వినూత్నతలు

**1338 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు రీసైకిల్ చేయబడ్డాయి,**

**124,360 టన్నుల Co2 ఉద్గారాల ఆదా మరియు 8300 చెట్లు సంరక్షించబడ్డాయి.**



ముంబై, ఫిబ్రవరి 29, 2024: పన్నెండు స్టార్టప్‌లు కలసి వినూత్నమైన ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల నిర్వహణ పరిష్కారాలను కొత్త వ్యాపార నమూనాలుగా మార్చాయి. గత 12 నెలల్లో ఏకంగా 124,360 టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను ఆదా చేశాయి. ఈ స్టార్టప్‌లు జనవరి 2023లో 'ఇన్నోవేషన్ ఇన్ ప్లాస్టిక్స్: ది పొటెన్షియల్ అండ్ పాసిబిలిటీస్' ప్లేబుక్‌లో ప్రదర్శించబడిన మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ ప్లాస్టిక్ పోర్ట్ ఫోలియోలో భాగం. ఎంఐఎఫ్ దీనిని, ఇతర డేటా పాయింట్లను ప్లాస్టిక్ ప్రోగ్రామ్ రౌండప్ 2023-24లో విడుదల చేసింది. ఇది ఒక రోజంతా జరిగే కార్యక్రమం, ఈరోజు ఇక్కడ జరుగుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ విలువ గొలుసులో ఎంఐఎఫ్ కేంద్రీకృత జోక్యం ప్రభావాన్ని ఈ స్టాక్-టేకింగ్ సమీక్షించింది. ఇది ప్లాస్టిక్ సమస్యను పరిష్కరించడానికి ఆవిష్కర్తలకు అవకాశాలను అందిస్తుంది.ఎంఐఎఫ్ ప్లేబుక్ ప్రకారం, భారతదేశ ప్లాస్టిక్ వినియోగం పెరుగుదల ఆందోళనకరంగా ఉంది. 2016-17లో 14 మిలియన్ టన్నుల నుండి 2019-20లో 20 మిలియన్ టన్నులకు పెరిగింది. అదే సమయంలో, ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి కూడా రెండింతలు పెరిగింది. మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఏటా 3.4 మి లియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నప్పటికీ, భారతదేశం కేవలం 30% మాత్రమే రీసైకిల్ చేస్తోంది. ఈ నేపథ్యంలో, ప్లాస్టిక్ వ్యర్థాల సవాలును పరిష్కరించడానికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడం లో ఎంఐఎఫ్ మద్దతు ఉన్న స్టార్టప్‌లు ఎలా గణనీయమైన పురోగతి సాధించాయో తెలుసుకోవడం ఆశ్చర్య దాయకంగా ఉంటుంది. ఉదాహరణకు, Ibans, Dharaksha వరుసగా బయోక్రాఫ్ట్ ఇన్నోవేషన్ టెక్నాలజీ, మైసిలియం ఉపయోగించి 60 టన్నుల వ్యవసాయ వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించాయి. Ishitva, Ibanss, Ricron, Padcare, Bintix, Dharaksha, Angirus సహా ఇతర స్టార్టప్‌లు సమష్టిగా 124,360 టన్నుల CO2 ఉద్గారాలను ఆదా చేశాయి. సామాజిక, ఆర్థిక, పర్యావరణ ప్రభావాన్ని సృష్టించే ఆవిష్కరణల పై ఎంఐఎఫ్ దృష్టిని ఇవి ధృవీకరిస్తున్నాయి. తర్వాత, 37 టన్నుల శానిటరీ ప్యాడ్‌లను రీసైకిల్ చేసి, 74,000 కి.మీ ల్యాండ్ ఫిల్ ఏరియాను సంరక్షిం చిన ప్యాడ్‌కేర్ వంటి ఇతరసంస్థలు పోర్ట్ ఫోలియోలో ఉన్నాయి. ఇషిత్వ రోబోటిక్స్ ఏఐ-ఆధారిత సార్టింగ్ మెషిన్ 100,000 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను క్రమబద్ధీకరించింది. 265,000 టన్నుల చమురు బారెల్స్ ను ఆదా చేయడం ద్వారా శక్తి పరిరక్షణను గణనీయంగా ప్రభావితం చేసింది. Ricron Panels, Angirus% వంటి ఆవిష్కర్తలు వినూత్న నిర్మాణ ఉత్పత్తుల ద్వారా 1,338 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేశాయి. గృ హ వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించిన బింటిక్స్, 360 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, 8,300 చెట్ల ను సంరక్షిస్తూ జీవవైవిధ్య పరిరక్షణ, వ్యర్థాల తగ్గింపునకు దోహదపడింది.

మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు హర్ష్ మారివాలా మాట్లాడుతూ, " "ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ ఇన్నోవేషన్ ప్రయాణంలో ఎంఐఎఫ్ ముందంజలో ఉంది. వినూత్నత పట్ల మా నిబద్ధత స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక సవాళ్లను గుర్తించడానికి, పరిష్కరించేందుకు మమ్మల్ని నడిపిస్తోంది. ప్లాస్టిక్ సమస్యను పరిష్కరిం చడంలో మనం ముందుకు సాగుతున్నప్పుడు ఈ చొరవ భారతదేశానికి గేమ్-ఛేంజర్‌గా ఉంటుంది. వాస్తవానికి, పెట్టుబడికి మించిన నిర్వహణ వాతావరణాన్ని అందించడం ద్వారా, ప్రపంచంలోని మిగిలిన ప్రాం తాలకు కూడా అందించడానికి వీలుగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కోసం ఒక నమూనాను రూపొందించ గల మని నేను నమ్ముతున్నాను" అని అన్నారు. మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ పాలక మండలి గౌరవ చైర్‌పర్సన్ అమిత్ చంద్ర మాట్లాడుతూ, """వ్యర్థాల నిర్వహణ రంగంలో విప్లవాత్మక మార్పులకు సిద్ధంగా ఉన్న వినూత్న పరిష్కారాలకు మా ప్లాస్టిక్ ప్రోగ్రామ్ మద్దతునిచ్చింది. కన్స్యూమరిజం పెరుగుతున్నందున, విలువ గొలుసు అంతటా సవాళ్లను పరిష్కరించ డానికి ఆవిష్కరణలకు అపారమైన అవకాశం ఉంది. సంచలనం కలిగించే ఆవిష్కర్తల ప్రయాణానికి మద్ద తు ఇవ్వడం, సుస్థిరమైన ఆవిష్కరణల కోసం పర్యావరణ వ్యవస్థ నిర్మాణానికి సహకరించడం ఎంఐఎఫ్ కి గర్వంగా ఉంది" అని ఆయన అన్నారు. మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ హెడ్ సురంజనా ఘోష్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ విభాగంలో ఆవిష్కర్తలను ప్రోత్సహించడంలో ఎంఐఎఫ్ కీలక పాత్రను చాటిచెప్పారు. """ప్లేబుక్ ప్రారంభించినప్పటి నుం డి, ఎంఐఎఫ్ దాని సిఫార్సులను అనుసరించడం, మద్దతుకు ప్రాధాన్యత ఇవ్వడం, స్టార్టప్‌లకు అండగా నిలవడంలో ముందుంది. ఈ నిబద్ధత గణనీయమైన పురోగతికి దారితీసింది. మా జోక్యాల ఫలితంగా ఈ వ్య వస్థాపకులకు ఇతర విలువ-ఆధారిత కార్యక్రమాలతో పాటుగా కోట్ల రూపాయల డీల్ ఆర్డర్లు వచ్చాయి. ఈ ప్రయత్నాలు స్పష్టమైన ఫలితాలను అందించడానికి, సుస్థిరమైన ఆవిష్కరణల కోసం అభివృద్ధి చెందుతున్న పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి మా అంకితభావాన్ని నొక్కి చెబుతున్నాయి" 'అని ఆమె అన్నారు.

మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ గురించి:

మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ అనేది భారతదేశ ఇన్నోవేషన్ ల్యాండ్‌స్కేప్‌ను ప్రోత్సహించడానికి, ఉత్ప్రేరకపరచడానికి కట్టుబడి ఉన్న దాతృత్వ సంస్థ. మిలియన్ల మంది ప్రజలకు పెద్ద ఎత్తున ప్రభావాన్ని సృష్టించ గల అద్భుతమైన సాంకేతికతలను కలిగి ఉంది.

ఎంఐఎఫ్ లక్ష్యం భారతదేశంలో దీర్ఘకాలిక సామాజిక-ఆర్థిక, పర్యావరణ ప్రభావాన్ని సృష్టించే సంభావ్యత తో సంచలనం కలిగించే ఆవిష్కరణలను గుర్తించడం, వాటి దృశ్యమానత, అవకాశాలు, విజయ సంభావ్యత ను పెంచడానికి వాటికి సమగ్ర మద్దతును అందించడం.


## విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ,
పాఠకుల విశేష ప్రజాదరణ పొందుతూ
విజయవంతంగా రెండు తెలుగు రాష్ట్రాలలో నడపబడుతున్న
'ప్రజాకలం' తెలుగు దినపత్రికకు
జర్నలిజంపై ఆసక్తి, తెలుగు భాష పట్ల అవగాహన కలిగి
వ్రాయడం, చదవడంతో పాటు ప్రస్తుత సమాజం పట్ల బాధ్యత
కలిగిన విలేకరులు అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాప్
రిపోర్టర్లు మండలాల వారిగా కావలెను.

ప్రజా కలం PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

తెలంగాణలో జిల్లాల వారిగా ఇంఛార్జ్ కావలెను

సంప్రదించాల్సిన నంబరు: 9010972526

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారిగా ఇంఛార్జ్ కావలెను


# గులాబీ వర్సెస్ కాంగ్రెస్



హైదరాబాద్ : మార్చి 1 నుంచి 'చలో మేడిగడ్డ' కార్యక్రమానికి బీఆర్ఎస్ పిలుపునిచ్చింది,మేడిగడ్డకు తామ కూడా వెళ్తామని కేసీఆర్ నల్లగొండ సభలో ప్రకటించారు. ఆయన మాటలకు తగ్గట్లుగా కేసీఆర్ షెడ్యూల్ రూపొందించారు. తెలంగాణ ఎన్నికలు వాతావరణం మంచి వేడి మీద ఉన్న సమయంలో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయింది. ఆ విషయాన్ని పెద్దగా హైలెట్ కాకుండా బీఆర్ఎస్ జాగ్రత్త పడింది. కానీ తర్వాత కృష్ణా జలాల అంశాన్ని బీఆర్ఎస్ అందుకోవడంతో కౌంటర్ ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ మేడిగడ్డను అందుకుంది. మీడియాను..ఎమ్మెల్యేలను మేడిగడ్డకు తీసుకు వెళ్లి పగుళ్లను చూపించింది. నివేదిక ప్రకారం ఇప్పుడు రిపేర్ల చేయడం సాధ్యం కాదని.. ఆ పిల్లర్లు తొలగించి కొత్తగా నిర్మంచాల్సిందేనని నిపుణలు చెబుతున్నారు. అలాగే మరో రెండు బ్యారేజీల్లోనూ సమస్యలు ఉన్నాయని నివేదికలు వచ్చాయి. ఈ విషయంలో డాక్యుమెంట్లు ముందు పెట్టి కాంగ్రెస్ ఆరోపణలు చేస్తోంది. కాళేశ్వరంపై కాగ్ ఇచ్చిన రిపోర్ట్ .. బీఆర్ఎస్ నేతలకు మరింత ఇబ్బందికరం. కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్ లో 63 వేల 352 కోట్లు చూపెట్టగా.. లక్షా 6 వేల కోట్లకు అంచనా వ్యయం పెంచినట్లు కాగ్ తన నివేదికలో స్పష్టం చేసింది. ఇదే సమయంలో మొత్తం ప్రాజెక్టు పూర్తయ్యే వరకు లక్షా 47 వేల 427 కోట్లు ఖర్చు అవుతుందని స్పష్టం చేసింది కాగ్. కాళేశ్వరం కోసం తెచ్చిన రుణాలలో ప్రతి ఏటా14 వేల 462 కోట్లు రుణాల చెల్లించాలని కాగ్ నివేదికలో చెప్పింది. వసరం లెకున్న 3 టీఎంసీలకు ప్రతిపాదన పెంచారని చెప్పింది. దింతో 28 వేల151 కోట్ల అదనపు వ్యయం ఏర్పడ్డదని తెలిపింది. కాళేశ్వరం నిర్వహణకు 10 వేల కోట్లు పడుతోందని తెలిపింది. ఆర్థికంగా కూడా ఏ మాత్రం లాభదాయకం కాదని.. రాష్ట్రం మొత్తానికి అవసరమైన కరెంట్ వాడాలని కూడా స్పష్టం చేసింది. కరెంట్ బిల్లులకు అయ్యే ఖర్చు కూడా వెనక్కి రాదని తెలిపింది. ఇది.. బీఆర్ఎస్ నేతల వైఫల్యాన్ని బయటపెట్టేదిలానే ఉంది. కాళేశ్వరం అంశాన్ని ఎంత కాలం లైవ్‌లో ఉంచితే తమకు అంత మేలని.. తెలంగాణను ఎలా దోచుకున్నారని అందరికీ ఎప్పటికప్పుడు గుర్తు చేసినట్లు అవుతుందని కాంగ్రెస్ నేతలంటున్నారు. కాళేశ్వరం విషయంలో మేడిగడ్డ లాంటి వైఫల్యం కళ్ల ముందే ఉన్నప్పుడు బీఆర్ఎస్ మరింత భిన్నమైన వ్యూహాన్ని పాటించాల్సి ఉంది. ఆ అంశాన్ని మరుగున పడేలా చేయాల్సిల ఉంది. కేటీఆర్ వ్యూహం ఏమిటో కానీ.. బీఆర్ఎస్ నేతలకు కూడా మేడిగడ్డ అంశాన్ని లైవ్‌లో ఉంచి సాధించుకునేదేమిటన్న సందేహం వ్యక్తమవుతోంది.






# మల్కాజిగిరి సర్కిల్ వివిధ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే

మల్కాజిగిరి,ఫిబ్రవరి 29,(ప్రజా కలం ప్రతినిధి)

వినాయక్ నగర్ డివిజన్ లో శివనగర్ కాలనీ,టెలీకామ్ కాలనీ,కాకతీయ నగర్,దిన్ దయల్ నగర్ లతోపాటు సర్కిల్ పరిధిలోని వివిధ కాలనీలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం అధికారులతో కలిసి పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు.శివనగర్ కాలనీలో కాలనీ వాసులు డ్రైన్ బాక్స్ పెంచాలని అదేవిదంగా రోడ్డు సమస్యలు, త్రీ ఫేస్ కరెంటు కావాలని కోరారు.టెలీకామ్ కాలనీ లో రోడ్డు కావాలని కాలనీ వాసులు ఎమ్మెల్యే



దృష్టికి తీసుకువచ్చారు.కాకతీయ నగర్ లో ప్రధానంగా పెరల్స్ హై స్కూల్ నుంచి నాగ లక్ష్మి ఫంక్షన్ హాల్ వరకు రోడ్డు కావాలని కాలనీ వాసులు కోరారు.కాకతీయ నగర్ రోడ్ నాలా నిర్మించడం వల్ల రోడ్డు తవ్వి వదిలేసారు,డ్రైనేజీ సమస్యతో బాధపడుతున్నామని తెలిపారు. దిన్ దయాల్ నగర్ లో ప్రదానంగా డ్రైనేజీ సమస్యలతో గత కోన్నెలుగా బాధ పడుతున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే కాలనీ వాసులతో కలిసి మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటీ కమీషనర్ రాజు,ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై సమస్యలను వివరించారు. సమస్య పరిష్కారానికి కావాల్సిన మార్గాలను వెతకాలి అన్నారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసిఈఈ లక్ష్మణ్, డిఈలు మహేష్, లౌక్య,ఏఈలు-సత్య లక్ష్మి, స్వరూప,నవీన్ నాయకులు బద్ద పరుశురాం రెడ్డి,అంజయ్య,తులసి సురేష్,బాలకృష్ణ గుప్తా, కాలనీ వాసులు పాల్గొన్నారు

# ఆస్తిపన్ను చెల్లింపు విషయంలో సమస్యలను పరిష్కరించుకోండి

## -మల్కాజిగిరి జిహెచ్ఎంసి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రాజు

మల్కాజిగిరి,ఫిబ్రవరి29, ప్రజాకలం ప్రతినిధి

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని నివాసం ఉంటున్న మల్కాజిగిరి వాసులు ఆస్తిపన్ను చెల్లింపు విషయంలో సమస్యలను పరిష్కరిం చుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం చెల్లింపుల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించుకోవడం కోసం పరిష్కారవేదికను సర్కిల్ కార్యాలయంలో ఆదివారం మార్చి3 నాడు ఏర్పాటు చేస్తున్నట్లు మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రాజు గురువారం తెలిపారు. ప్రతి ఆదివారం స్పెషల్ కౌంటర్లను సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని



రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటారని రాజు చెప్పారు.2022-23 సంవత్సరాలు అపరాధ రుసుము 90 శాతం మాఫీ తో కేవలం 10శాతం అపరాధ రుసుము మాత్రమే చెల్లించేందుకు చివరి గొప్ప అవకాశం ఉందని ఆస్థిపన్ను చెల్లించుటకు వారిని ప్రోత్సహించడానికి వన్ టైం స్కీమును ఉపయోగించుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం జరిగినదని కావున ఇట్టి గొప్ప అవకాశాన్ని పట్టణ గృహ మరియు వాణిజ్య వినియోగదారులు అందరూ సదవకాశాన్ని వినియోగించు కోవాలని తెలిపారు.బకాయిలు ఉన్న ఆస్థిపన్ను చెల్లింపు దారులకు వారెంటు జారీ చేస్థు చట్ట ప్రకారం పన్నులు వసూలు చేయడం జరుగుతుందని కావున పెద్ద పెద్ద సంస్థలు సినిమా హల్స్,హెూటల్స్ ఫంక్షన్ హాల్ యాజమాన్లు ఆస్థి పన్ను వ్యాపారాలు లైసెన్సు ఫీజులు చెల్లించవలసినదిగా కమిషనర్ విజ్ఞప్తి చేశారు.సకాలంలో పనులు చెల్లించి సర్కిల్ అభివృద్ధికి తోడ్పడాల్సిందిగా కోరుతున్నట్లు వారు పేర్కొన్నారు.

# కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ సన్నా శ్రీశైలం యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్

గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్నా శ్రీశైలం యాదవ్ పుట్టినరోజు వేడుకలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్యఅతిథిగా పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...వారి ఇటువంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో స్థానిక, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి

## -రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక



రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఫిబ్రవరి 29, (ప్రజా కలం)

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోనిహా సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ శశాంక జిల్లాలోని మునిసిపాలిటీల పరిధిలో అందించే నీటి సరఫరా పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి నీటి సరఫరా పై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి ప్రారంభమైన దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి ప్రణాళిక బద్దంగా నీరు క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా చూడాలని అన్నారు. గత సంవత్సరం నీటి ఎద్దడిని ఎదుర్కొన్న ప్రాంతాలలో సమస్య పునరావృతం కాకుండా చూడాలని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో త్రాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సరి చేయాలని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నీటి సమస్యలు తలెత్తకుండా కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలోని రూరల్ ఏరియాల్లో, అర్బన్ ఏరియాల్లో,హబిటేషన్స్ లో ఎక్కడా త్రాగునీటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని అన్నారు.లీకేజ్ వంటి సమస్యలు తలెత్తకుండా పైప్ లైన్ మరమ్మత్తులు చేపట్టాలని, కొత్త పైప్ లైన్ కనెక్షన్లు ఇవ్వటం, వెంటనే బోర్ల మరమ్మత్తులు, ఫ్లషింగ్ చేయించాలని ఆదేశించారు. వేసవిలో నీటి సమస్య రాకుండా నివారించుటకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. అధికారులందరు బాధ్యతగా పని చేయాలని, సమిష్టిగా పని చేసి వేసవిలో నీటి సమస్యలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, భూపాల్ రెడ్డి, జడ్పీ సీఈవో కృష్ణ రెడ్డి, డిపిఓ, మిషన్ భగీరథ ఎస్.ఈ. ఆంజనేయులు, ఎస్.ఈ. పిఆర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను కాపాడడమే అధికారుల బాధ్యత

## -జగంగూడ మాజీ సర్పంచ్ చందుపట్ల విష్ణువర్ధన్ రెడ్డి




శామీర్ పేట, ఫిబ్రవరి 29 (ప్రజా కలం ప్రతినిధి ) : ప్రభుత్వ భూములను కాపాడటవే తమ బాధ్యత అని తాసిల్దార్ వెంకట నరసింహ రెడ్డి అన్నారు. గురువారం మూడు చింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామంలో మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాదు వారు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గంగూడ గ్రామ ప్రత్యేకాధికారి, తాసిల్దార్ వెంకట నరసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయుటకు ప్రతి ఒక్కరు సహకరించాలని, గ్రామ అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామ కంఠం భూమికి సంబంధించిన వివరాలను తెలుసుకొని ఆ దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ భూములను కాపాడుటకు తాము కృత నిశ్చయం తో ఉన్నట్లు ఆయన చెప్పారు. జగ్గంగూడ గ్రామంలోని గ్రామ కంఠం భూమిని (తోట బావి) నందు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారిచే క్రీడా మైదానంలో వాకింగ్ ట్రాక్, యువకులకు వ్యాయామ చేసుకోవడానికి ఓపెన్ జిమ్, మహిళలు బతుకమ్మలు వేసుకోవడానికి హౌస్ ఏర్పాటు, ఆ స్థలం చుట్టూ పూల మొక్కలు, ఔషధ మొక్కలు, నాటి అందంగా తీర్చిదిద్దుటగాను ముందుకు వచ్చిన యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు ప్రత్యేక అధికారి, మాజీ సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. అలాగే చిన్నారులు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఏర్పాటు చేయవలసిందిగా సంస్థ ప్రతినిధులను కోరారు. ప్రస్తుతం ఆ భూమిని అధికారులు పరిరక్షించడంతోపాటు హరితహారం లో భాగంగా మొక్కలు నాటాలని మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి కోరారు. అనంతరం తాసిల్దార్, గ్రామపంచాయతీ సిబ్బంది ని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సన్మానించారు.

మూడు చింతలపల్లి మండలానికి నూతనంగా విచ్చేసిన తాసిల్దార్ వెంకట నరసింహ రెడ్డిని మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి మనీ, మాజీ ఉపసర్పంచ్ బుద్ధి శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోస్ట్ ఆఫీస్ లో ప్రధాన మంత్రి కొత్త పథకం దేశవ్యాప్తంగా సోలార్ రూఫ్ టాప్ పథకం అమలు

## -మేడ్చల్ జిల్లా పోస్టల్ అధికారి సంపత్ రెడ్డి



శామీర్ పేట, ఫిబ్రవరి 29 (ప్రజా కలం ప్రతినిధి ) : దేశవ్యాప్తంగా సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తపాలా శాఖ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పోస్టల్ అధికారి జి.సంపత్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకంలో భాగంగా ఇండ్ల పైకప్పులపై సోలార్ ప్లాంట్లను అమర్చనుట్లు పేర్కొన్నారు. మేడ్చల్- మల్కాజిగిరిజిల్లా పరిధిలోనీ అన్ని పోస్ట్ ఆఫీసులలో రూ.300 యూనిట్ల ఉచిత విద్యుత్ ని కేంద్రం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ : ముఫ్త్ బిజిలి యోజన పథకం రిజిస్ట్రేషన్లను ప్రారంభించినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఇండ్లకు సబ్సిడీతో సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్లను నిర్మించి ఇచ్చి నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే ఈ పథకానికి పోస్ట్ ఆఫీస్ అధ్వర్యంలో రిజిస్ట్రేషన్లు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ పథకంకు రూ.1.80 లక్షలు కాగా ఇందులో రూ.78 వెలు సబ్సిడీ ఉంటుందని, ఆసక్తి గల వినియోగదారులు పోస్టాఫీస్‌ల లో సంప్రదించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు.

ఆన్‌లైన్‌లో నమోదయ్యాక సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారని, ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు మీ సమీప పోస్ట్ ఆఫీసులో సంప్రదించాలని కోరారు.

# మూడు చింతలపల్లి మండలం లో సర్వసభ్య సమావేశం






శామీర్ పేట, ఫిబ్రవరి 29 (ప్రజా కలం ప్రతినిధి ) : మూడు చింతల పల్లి మండల సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ హారిక మురళి గౌడ్ అధ్యక్షతన జరిగింది. సాధారణ సర్వసభ్య సమావేశం ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాలలో ప్రత్యేక అధికారులు చేపడుతున్న పనులు తదితరు అంశాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే వేసవికాలంలో గ్రామాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునూరు, శానిటేషన్ ఇతర అన్ని సౌకర్యాలను యధావిధిగా నిర్వహించాలని తెలిపారు. అలాగే విధ్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు ప్రవేశపెట్టిన అందులో గృహ జ్యోతి పథకానికి 200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు కొరకు ఒక్క తెల్ల రేషన్ కార్డు ఉన్నావరికి ఒక్క మీటర్ కి ఈ అవకాశాన్ని ఉపయోగించాకోవచ్చు అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో వత్సలాదేవి, ఎమ్మార్వో వెంకట నరసింహారెడ్డి, భగీరథ డీఈవో అర్చన, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గోనె హనుమత్ రెడ్డి, ఎంపీటీసీ అఖిలేష్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు గౌస్ పాషా, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన :- డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్

అడ్డగూడూర్ /ఫిబ్రవరి 29(ప్రజా కలం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల యువజన నాయకులు మేకల పవన్-మమత గార్ల వివాహ వేడుక M,R ఫంక్షన్ హాల్ కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన పవన్ సాయి హాస్పటల్ అధినేత డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్ వారితో పాటు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలేబోయిన లింగయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలెంల సైదులు, విద్యా సాగర్, సురేష్, వరిగడ్డి సైదులు, బోనాల నగేష్, నవీన్, శివ,తదితరులు పాల్గొన్నారు.

# యువతి అదృశ్యం

వలిగొండ మార్చి 1 ప్రజాకలం:యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని గోకారంలో బుధవారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గోకారం గ్రామానికి చెందిన నారి అశోక్ చిన్న కుమార్తె



మనీషాకు 2020వ సంవత్సరంలో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని మసీద్ గూడెం గ్రామానికి చెందిన గుత్తా శ్రీశైలంతో వివాహమైంది.అటు తర్వాత 6 నెలల క్రితం ఈమెకు విడాకులు తీసుకొని.అప్పటి నుండి తల్లితండ్రు వద్ద గోకారంలో ఉంటుంది.ఈ నెల 23వ తేదిన సూర్యాపేటలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లివస్తా బుధవారం అదృశ్యమైందన్నారు.బంధువుల ఇండ్లల్లో,తెలిసిన వారి ఇండ్లలో ఎక్కడ వెతికిన యువతి ఆచూకి లభ్యం కాకపోవడంతో యువతి కుటుంబ సభ్యులు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ లాల్ తెలిపారు.

# మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతి

వలిగొండ మార్చి 1 ప్రజాకలం:మండల పరిధిలోని కేర్చిపల్లి గ్రామానికి చెందిన



కోల సంతోష తాజాగా తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల ఫలితాలలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది.టీజీటి స్టేట్ 5వ ర్యాంక్,పిజిటి స్టేట్ 12 వ ర్యాంక్,జేఎల్ 35వ ర్యాంక్,గురుకుల ఫలితాలలో మూడింటిలోనూ స్టేట్ ర్యాంక్ సాధించడం పట్ల గ్రామస్తులు ,కుటుం బీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహకంతోనే మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు.

# ఎస్సైని సన్మానించిన మాదిగ జేఏసీ అధ్యక్షులు గణేష్

సంస్థాన్ నారాయణపురం. ఫిబ్రవరి 29. ప్రజా కలం.

నూతనంగా బాధ్యతలు తీసుకున్న సంస్థాన్ నారాయణపురం ఎస్ఐ



ని మాదిగ జేఏసీ అధ్యక్షులు, మిర్యాల ఐఎన్టిసి గ్రామ శాఖ అధ్యక్షులు దొల గణేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు..ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ మండల స్థాయిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అరికట్టాలని విన్నవించుకున్నారు.. మద్యం బెల్ట్ షాపుల అరికట్టే విదంగా చూడాలని కోరారు..ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ నాయకులు ఐ ఎన్ టి యు సి నాయకులు పాల్గొన్నారు.

# వధువు కుటుంబానికి సాయం

వలిగొండ మార్చి 1 ప్రజాకలం: మండల పరిధిలోని పహిల్వాన్ పురం గ్రామానికి చెందిన పాల్వంచ జానకమ్మ మనోహర్ దంపతుల కుమార్తె కల్యాణి వివాహం పహిల్వాన్ పురం గ్రామంలో ఘనంగ జరిగింది.ఈ వివాహానికి అదే గ్రామానికి చెందిన ఏజెఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎలిమినేటి జంగారెడ్డి సమకూర్చిన 10



వేల రూపాయలు వదువు కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# గురుకులం ఉద్యోగానికి ఎంపికైన పంచాయతీ కార్యదర్శి



వలిగొండ మార్చి 1 ప్రజాకలం: మండలం పరిదిలోని పులిగిల్ల గ్రామానికి చెందిన ఆలేటి స్వప్న కేర్చిపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నది.ఈ క్రమంలోనే తనదైన శైలిలో గురుకుల ఉద్యోగానికి ప్రిపేర్ అయ్యి మంచి ప్రతిభను కనబరిచి తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గురుకుల ఉద్యోగ ఫలితాలలో స్టేట్ ర్యాంక్ 35 జేఎల్ తెలుగు, పిజిటి ఎకనామిక్స్ లో ఉద్యోగాన్ని సాధించడం జరిగింది.ఉద్యోగాన్ని సాధించడం పట్ల కుటుంబ సభ్యులు అదేవిధంగా పులిగిల్ల గ్రామ ప్రజలు,కేర్చిపల్లి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఉద్యోగం రావడం పట్ల కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు ఎంతో ఉన్నాయన్నారు.ప్రణాళిక ప్రకారం లక్ష్యాన్ని ఎంచుకొని కష్ట పడి చదివితే పోటీ పరీక్షలో విజయం సాధించవచ్చాన్నారు.

# ప్రజా సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం

## డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి




**కల్వకుర్తి, ఫిబ్రవరి 29, (ప్రజా కలం)**
ఈనెల 27న చేవెళ్ల వేదికగా జరిగిన జనజాతర సభలో ఆరు గ్యారెంటీలో భాగంగా మరో రెండు గ్యారెంటీలు 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్ 200యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి గ్యారంటిలు అమలైన సందర్భంగా కడ్తాల్ మండల కేంద్రంలోని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి అభినందనలు తెలుపుతూ పాలాభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గూడూరు శ్రీనివాస్ రెడ్డి నాయకులు మాట్లాడుతూ మన తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజా సంక్షేమమే తమ మొదటి ప్రాధాన్యమని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు 500 రూపాలకే గ్యాస్ సిలిండర్ మరియు గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ, ప్రజా పాలనలో మహిళలకు బ్రహ్మ రథం పడుతున్నారని, ఇందిరమ్మ రాజ్యంలో ఆరు గ్యారంటీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డు ఉన్న వారికి 10 లక్షల ఆరోగ్య భీమా పథకం ఇదివరకే అమలు చేసిందని అన్నారు. ఇప్పుడు 500రూ లకు గ్యాస్ పంపిణీ, 200యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి గ్యారంటిలు కూడా అమలైనవని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన రెండున్నర నెలల్లోనే 4 పథకాలను అమలు చేసిన ఘనత మా కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వానిదే అన్నారు. కచ్చితంగా ఇచ్చిన హామీ ప్రకారం 100 రోజుల్లో అరు గ్యారెంటీలను అమలు చేస్తుంది అని అన్నారు. తెలంగాణలో 10 ఏళ్ల తర్వాత ఇప్పుడే ప్రజా పాలన ప్రారంభమైందని, రాష్ట్రంలో ప్రజాపాలన సంకీర్ణ ప్రభుత్వ పాలన నడుస్తుందని అన్నారు.

రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కూడా మా కార్యకర్తల అండతో భారి మెజార్టీలతో అత్యధిక స్థానాలు గెలిచి ఎఐసిసి నాయకులు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడమే ధ్యేయంగా కృషి చేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బీఖ్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, ఎంపిటిసి అద్దాల రాములు, సీనియర్ నాయకులు సేవాదళ్ లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు మల్లేష్ గౌడ్, జంగీర్ అలి, లక్ష్మణ్, మల్లేష్ గౌడ్, సత్యం యాదవ్, శంకర్, రాము, రామకృష్ణ, జవహర్ నాయక్, శ్రీను యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు హీరాసింగ్, క్యామ రాజేష్, ఎర్రోళ్ల శ్రీకాంత్, ఇమ్రాన్ బాబా, బోసు రవి, రమేష్ నాయక్, ప్రవీణ్ గౌడ్, మనికిరణ్, చంద్రశేఖర్, హరి, నరేష్, శ్రీశైలం, మహేష్, సెవ్యా, రాజు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ తీగల అనిత హరినాథ్ రెడ్డి



**మహేశ్వరం, ఫిబ్రవరి 29, (ప్రజా కలం)**
మహేశ్వరం మండలంలో ఎన్ డి తాండ గ్రామంలో శ్రీఆంజనేయస్వామి ధ్వజస్తంభ శిఖర విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్పర్సన్ డాక్టర్ తీగల అనిత హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు బజాబంత్రులతో అనిత రెడ్డి గారిని ఘనంగా స్వాగతం పలికారు. అనిత రెడ్డి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆ ఆంజనేయస్వామిని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునీత అంధ్యానాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షులు గోపాల్, మర్యాద రాఘవేందర్ రెడ్డి, కోర్పోలు రాకేష్ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తీగల కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు

**మహేశ్వరం, ఫిబ్రవరి 29, (ప్రజా కలం)**
మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట మాజీ శాసనసభ్యుడు తీగల కృష్ణారెడ్డి క్యాంపు కార్యాలయంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కి చెందిన కార్పొరేటర్లు పలువురు



నాయకులు తీగల కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తీగల క్రిష్ణ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా అందరూ కలిసి ముందుకు రావాలని రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుద్దామని తెలిపారు. మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పలు సమస్యలను కార్పొరేటర్లు తీగల కృష్ణారెడ్డి దృష్టికి తీసుకురావడం జరిగింది. సమస్యల పరిష్కారం కోసం అందరం కలిసి ముందుకు నడుద్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి కార్పొరేషన్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందే విధంగా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అక్కి మాధవి ఈశ్వర్ ,అరుణ ప్రభాకర్ రెడ్డి, గజ్జల రామచందర్ ,వేముల నరసింహ నందకుమార్ , నాయకులు మూల హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న మహేశ్వరం ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్



**మహేశ్వరం, ఫిబ్రవరి 29, (ప్రజా కలం)** మహేశ్వరం నియోజకవర్గం లోని మహేశ్వరం మండలం ఎన్ డి తాండ గ్రామంలో నిర్మించిన హనుమాన్ దేవాలయం ప్రారంభోత్సవంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి అందెల శ్రీరాములు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరు ఆంజనేయు స్వామి దేవాలయం నిర్మించు కోవడం చాలా సంతోషకర మని, అ స్వామి వారి కృపా కటాక్షలు మన అందరి పైనా ఉండాలి అని కోరుకున్నారు.

మరియు గ్రామ ప్రజలకు ఆలయ కమిటీ నిర్వాహ కులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల ఎంపీపీ కుండె వెంకటేష్, బిజెవైఎం జిల్లా అధ్యక్షులు యాదేశ్, ఎంపీటీసీ సుదర్శన్ యాదవ్, బీజేవైఎం మండల అధ్యక్షులు శ్రావణ్, గిరిజన మోర్చా నాయకులు దేశ్య నాయక్ మరియు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రోహిత్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి

**మహేశ్వరం, ఫిబ్రవరి 29, (ప్రజా కలం)**
మహేశ్వరం నియోజకవర్గం ఎన్ఎస్యుఐ నాయకుడు



రోహిత్ పుట్టినరోజు సందర్భంగా శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరిన బారాస ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు

**- కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ జి చిన్నారెడ్డి**




**కల్వకుర్తి, ఫిబ్రవరి 29, (ప్రజా కలం)**
కల్వకుర్తి బారాస ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీ లో చేరారు.

రేవల్లి మండలం జడ్పిటిసి సభ్యులు భీమయ్య భాస్కరరావు మాజీ సర్పంచ్ జానకి రామ్ రెడ్డి మాజీ ఎంపీపీ రఘు యాదవ్ సింగిల్ విండో చైర్మన్ గోపాల్పేట చందాపురం సహదేవ్ మాజీ సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్ యాదవ్ మాజీ ఉపసర్పంచ్ చందాపురం గ్రామ యువకులు యాదవ సంఘం అధ్యక్షులు చిరంజీవి,మణిగిల్ల మోజెర్ల నాగరాజు, సర్పంచ్ మోజర్ల వారి బృందం గోపాల్ నాయక్ పామిరెడ్డిపల్లి ముందర తండా వారి బృందం రవీందర్ రెడ్డి మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి సింగల్ విండో డైరెక్టర్ వారి బృందం ఆల్వాల లక్ష్మీకాంతరెడ్డి సింగల్ విండో డైరెక్టర్ వారి బృందం పెబ్బేరు తోమాలపల్లి కృపాకర్ రెడ్డి జానపేట మహేశ్వర్ రెడ్డి వివిధ పార్టీలకు చెందిన వివిధ గ్రామాల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఏఐపిసి నేషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లేల ఆదిత్య రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజీవ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎద్దుల విజయ వర్ధన్ రెడ్డి పెంటన్న మాజీ సింగిల్ విండో చైర్మన్ ఐ సత్య రెడ్డి వనపర్తి పట్టణ మాజీ అధ్యక్షులు కిరణ్ కుమార్, రేవల్లి చిన్నారెడ్డి గోపాల్పేట జి ప్రవీణ్ కుమార్ రెడ్డి వనపర్తి సింగిల్ విండో డైరెక్టర్ రామకృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ అన్ని స్థాయిల నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్వరం మాజీ శాసనసభ్యుడు తీగల కృష్ణారెడ్డి



**మహేశ్వరం, ఫిబ్రవరి 29, (ప్రజా కలం)**
మహేశ్వరం మండలం ఎన్ డి తాండ గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి ధ్వజస్తంభ శిఖర విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి మహేశ్వరం మాజీ శాసనసభ్యుడు తీగల కృష్ణారెడ్డి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తేల కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు అంతా మంచి జరగాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఏసిపి ఉమామహేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిసిన తుక్కుగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

**మహేశ్వరం, ఫిబ్రవరి 29, (ప్రజా కలం)**
మహేశ్వరం నియోజకవర్గం ఏసిపి ఉమామహేశ్వరరావు ను తుక్కుగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తుక్కుగూడ కార్యాలయంలో ఏసిపి ఉమామహేశ్వరరావు ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపాలిటీ. టిపిసిసి సెక్రెటరీ జానకిరామ్, ఉ



పాధ్యక్షుడు శివగళ్ల యాదయ్య, కప్పల రాజు, కోటగళ్ల రాజ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు కందుల సమతా ప్రకాష్, లక్ష్మణ్, బుసన్న గారి స్వామి, రెడ్డి గళ్ళ అజయ్, కే అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## 28వ డివిజన్ అధ్యక్షుడిగా బలరామకృష్ణ ను నియమించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**మహేశ్వరం, ఫిబ్రవరి 29, (ప్రజా కలం)**
మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 28వ డివిజన్ అధ్యక్షుడిగా బలరాం ను నియమిస్తూ నియామక పత్రాన్ని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి దోహద పడాలని అందరిని కలుపుకు పోవాలని మాజీ మంత్రి గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, ఉద్యమ నాయకులు హనుమంతరావు, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి , దీప్లాల్ చౌహాన్, రాజు, నాగరాజు, వీర రాఘవరెడ్డి, లక్ష్మి సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి సమీక్ష సమావేశం

### -రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక



**మహేశ్వరం, ఫిబ్రవరి 29, (ప్రజా కలం)**
గురువారం రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలోని కలెక్టర్ ఛాంబర్ లో మహబుబ్ నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారులతో డిఏఓ లతో జిల్లా కలెక్టర్ శశాంక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26వ తారీఖు మహబుబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీహా ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. అదే రోజు నుండి ఎన్నికల కోడ్ వర్తింస్తుం దని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో సైతం నియమావళి అమల్లోకి వచ్చిందని అన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ ) నిబంధనలు, ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలైన్ టీంల బాధ్యతలను తెలియజేశారు. అసెంబ్లీ శాసన సభ ఎన్నికల మాదిరిగానే ఎన్నికల కోడ్ వర్తిస్తుందని, జిల్లాలో ఎఫ్.ఎస్టి, ఎస్.ఎస్.టి, వియస్ టి టీము లను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలలో కూడా నోడల్ అధికారులు వారికి కేటా యించే విధులను ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. శాసన సభ ఎన్నికలలో తక్కువ ఓటింగ్ శాతం నమోదు అయిన ప్రాంతాలలోని ప్రజలకు స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటు హక్కు వినియోగం పై అవగాహన కల్పించా లని డీఆర్డీఏ పిడి కి సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో 1500 కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే వాటికి సంబంధించి సహాయక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయుటకు గుర్తించాలని సూచించారు. ఫిర్యాదులపై నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు స్పందించే విధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు సమన్వయం తో తమ విధులను నిర్వర్తించాల్సిందిగా సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణ రెడ్డి,హౌ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పిడి శ్రీలత, సీపీఓ సౌమ్య, జిల్లా పరిశ్రమల అధికారి, ఎన్నికల విభాగం అధికారి సైదులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, డిఏఓలు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by **Kalakonda Ramakrishna**, Printed at M/s. Swetha Offset Printers, H.No. 2-10-92, Weekly Bazar, Boigally, Nizamabad-503001, Telangana State and Published from H.No. 2-10-92, Weekly Bazar, Boigally, Nizamabad-503001, Telangana State, Editor: **Kalakonda Ramakrishna**, RNI. Regn.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com